గణపయ్యకు తుది మెరుగులు
- చవితి వేడుకలు సమీపించిన నేపథ్యంలో కళాకారులు బిజీ
- గొర్లివానిపాలెం కేంద్రంగా వివిధ ఆకృతుల్లో ప్రతిమల తయారీ · 7లో



డెంగ్యూ కలకలం!



పాడేరులో ఒకరు, రాజవొమ్మంగిలో మరొకరి మృతి

- మరణాలపై కలెక్టర్ సీరియస్
- విచారణకు ఆదేశం
- జేసీ, ఐటీడీఏ పీవోలు విచారణ

పాడేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డెంగ్యూ మరణాలు కలకలం రేపుతున్నాయి. జిల్లా కేంద్రం పాడేరులో, రంపచోడవరం డివిజన్ పరిధిలోని రాజవొమ్మంగిలో మరొకరు డెంగ్యూతో మృతి చెందడంపై కలెక్టర్ దినేశ్‌కుమార్ సీరియస్ అయ్యారు. డెంగ్యూ మరణాలపై విచారణకు అధికారులను నియమించారు. జిల్లా కేంద్రం పాడేరులోని సోమవారం ఓ వ్యక్తికి ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించిన అనంతరం కేజీహెచ్‌కు తరలించాలని రిఫర్ చేశారు. కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆయన మృతి చెందాడు. డెంగ్యూ సోకిన నేపథ్యంలోనే ప్లేట్‌లెట్స్ పడిపోయి మృతి చెందాడని ప్రాథమికంగా నిర్ధారించారు. అలాగే అదే వీధిలో గత వారం ఒక వ్యక్తికి డెంగ్యూ సోకితే విశాఖపట్నం ప్రైవేటు ఆస్పత్రిలో చేరడంతో ప్రాణాపాయం తప్పింది. అలాగే రంపచోడవరం డివిజన్ పరిధిలో రాజవొమ్మంగిలోనూ సోమవారం ఓ వ్యక్తి డెంగ్యూతో మృతి చెందాడు. ఈ ఘటనలపై కలెక్టర్ దినేశ్‌కుమార్ స్పందించారు. డెంగ్యూ నిర్ధారణ, నియంత్రణపై వైద్యారోగ్య, మలేరియా శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

డెంగ్యూ మరణాలపై విచారణ

జిల్లాలో సోమవారం జరిగిన రెండు డెంగ్యూ మరణాలపై విచారణ చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ విచారణాధికారులను నియమించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్‌ను పాడేరులోని మరణానికి, రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం రాజవొమ్మంగిలో మరణానికి విచారణాధికారులుగా నియమించారు. రెండు మరణాలపై సమగ్ర విచారణ చేపట్టి తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అలాగే జిల్లాలో డెంగ్యూ వ్యాప్తి చెందకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచించారు.

విద్యార్థులకు పోషకాహారం పెట్టండి

మధ్యాహ్న భోజన వర్క్‌షాప్‌లో కలెక్టర్ దినేశ్‌కుమార్

- పిల్లలకు ఇష్టమైన భోజనాన్ని వండాలి
- ఆ విధంగా మెనూ చార్టును సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

పాడేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో పాడేరు డివిజన్ పరిధిలో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభులతో భౌతికంగాను, చింతూరు, రంపచోడవరం డివిజన్ పరిధిలోని వారితో వర్చువల్‌గా మధ్యాహ్న భోజన మెనూ అమలుపై మంగళవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి మధ్యాహ్నం భోజన పథకం అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించారని, విద్యార్థులకు ఇష్టమైన భోజన మెనూను అందించాలన్నారు. అలాగే ప్రాంతాలవారీగా ఉన్న ఆహారపు అలవాట్లు, బియ్యం, పప్పులు, నూనె ప్రభుత్వం నిర్దేశించిన విధంగా, ఆయా ప్రాంతాల్లో లభ్యమయ్యే కూరగాయలు, ఆకుకూరలతో వంటలు తయారు చేయాలన్నారు. అలాగే పిల్లలకు ఇష్టపడే ఆహార పదార్థాల్లో ... మిగతా 8వ పేజీలో

పెన్షన్ల పంపిణీలో పాడేరుకు ప్రథమ స్థానం

పాడేరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్ల పంపిణీలో రాష్ట్రంలో జిల్లాకు ప్రథమ స్థానం దక్కింది. జిల్లాలోని మొత్తం 22 మండలాల పరిధిలో 1,25,262 మంది సామాజిక పెన్షన్ల లబ్ధిదారులకు 1,24,681 మంది పెన్షన్ అందించి 99.54 శాతంగా నమోదైంది. జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 31న, సెప్టెంబరు 1, 2 తేదీల్లో సైతం వర్షాలు కురుస్తున్నప్పటికీ సచివాలయ, వెలుగు సిబ్బంది సకాలంలో లబ్ధిదారులు పెన్షన్ సొమ్మును అందించారు. దీంతో జిల్లాలో రెండు రోజుల్లో పెన్షన్ల పంపిణీలో 99.54 శాతంగా నమోదైంది. జిల్లా సామాజిక పెన్షన్ల పంపిణీలో ఎంతో కృషి చేసిన డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, వెలుగు సిబ్బంది, ఎంపీడీవోలు, సచివాలయ సిబ్బందిని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థినుల అదృశ్యం ఘటనలో ముగ్గురి అరెస్టు



బందవీధి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల (ఫైల్)

పాడేరురూరల్, సెప్టెంబరు 3: జి.మాడుగుల మండలం బందవీధి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు బాలికల అదృశ్యం ఘటనలో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దేవరాపల్లి నవీన్‌కుమార్ తెలిపారు. జిల్లాలో తీవ్ర సంచలనం రేకెత్తించిన బాలికల అదృశ్యంపై విచారణ చేపట్టిన ఐటీడీఏ పీవో అభిషేక్ ఇప్పటికే పాఠశాలకు చెందిన ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. బాలికల అదృశ్యంతో సంబంధం ఉన్న డుంబ్రిగూడ ఎంపీడీవో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ నిక్కుల శేషు, భారత్ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న చిన్నబాబు, గోపీచంద్‌లను మంగళవారం అరెస్టు చేశామని సీఐ నవీన్‌కుమార్ తెలిపారు.

ఏడుగురు సీడీపీవోలకు షోకాజ్‌లు

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేశ్‌కుమార్



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

- తప్పుడు నివేదికలిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక
- మండల స్థాయి సమావేశాల్లో ప్రత్యేకాధికారులు పాల్గొనాలి
- పల్లెలను డంపింగ్ ఫ్రీ విలేజీలుగా తీర్చిదిద్దాలి

పాడేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ వ్యవస్థ కార్యకలాపాలపై సమగ్ర సమాచారం అందించని ఏడుగురు సీడీపీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. జిల్లాలోని అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాలపై మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయిలో ఐసీడీఎస్ కార్యకలాపాలపై తప్పుడు నివేదికలు సమర్పిస్తే అందుకు బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో ఐసీడీఎస్ సేవలపై సమగ్ర నివేదికలు, సమాచారం అందించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. దీంతో అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, జీకే వీధి, జి.మాడుగుల మండలాలకు చెందిన సీడీపీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మిని కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల స్థాయిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలు, వారి స్థితిగతులపై తప్పుడు సమాచారం అందిస్తే సహించేది లేదన్నారు. అలాగే పౌష్టికాహార పునరావాస కేంద్రాల్లో అధికంగా బిల్లులు పెడుతున్నారని, వాటిని పరిశీలించి ఐసీడీఎస్ పీడీ కౌంటర్ సైన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి రెండు నెలలకు ఒకమారు లబ్ధిదారుల ఇళ్లను సందర్శించాలని, గ్రామ స్థాయిలో అందిస్తున్న సేవలు, ప్రగతి, బాల్య వివాహాలు, తదితర విషయాలను సూపర్‌వైజర్లకు సమగ్రంగా అందించాలన్నారు. అలాగే మండల స్థాయిలో జరిగే వివిధ శాఖలకు చెందిన సమావేశాల్లో ప్రత్యేకాధికారులు పాల్గొవాలన్నారు. అలాగే ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీలు, రికవరీ ప్రక్రియ సక్రమంగా జరిగేలా అధికారులు, సిబ్బంది కృషిచేయాలన్నారు. పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, పల్లెలను డంపింగ్ ఫ్రీ విలేజ్‌లుగా తీర్చిదిద్దాలన్నారు. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్ బాషా, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, డ్వామా పీడీ శివయ్య, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, హౌసింగ్ ఈఈ బి.బాబు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సీడీపీవోలు పాల్గొన్నారు.

నెరవేరని సొంతింటి కల

- గత వైసీపీ ప్రభుత్వం స్థలం చూపించకుండా ఇళ్ల పట్టాల పంపిణీ
- ఎన్నికల ముందు హడావిడి చేసిందని ఆదివాసీల ఆవేదన
- కూటమి ప్రభుత్వంపై ఆశలు



పక్కా ఇల్లు లేక అసౌకర్యాల నడుమ జీవనం సాగిస్తున్న ఆదివాసీలు

డుంబ్రిగుడ, సెప్టెంబరు 3: మన్యంలోని మారుమూల గ్రామాల ప్రజలకు సొంతింటి కల నెరవేరడం లేదు. మండలంలోని చాలా గ్రామాల్లో సరైన ఇల్లు లేక ఆదివాసీలు అవస్థలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని మోసగించిందని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలోని శెట్టిబంధ గ్రామంలో 274 కుటుంబాలు నివాసముంటున్నాయి. వీరిలో 16 మందికి ఇళ్లు లేవని గుర్తించిన గత వైసీపీ ప్రభుత్వం జగనన్న ఇళ్ల పట్టాలు ఇచ్చింది. అయితే అది కూడా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు ఇచ్చిందని, కనీసం స్థలం కూడా చూపించకుండా ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిందని లబ్ధిదారులు వాపోతున్నారు. అలాగే ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకం కింద నిర్మాణం చేపట్టిన కొన్ని ఇళ్లకు బిల్లులు మంజూరు చేయక పోవడంతో పనులు నిలిచిపోయాయని కొందరు ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి తొమ్మిది కిలో మీటర్ల దూరంలో ఉండే తమ గ్రామానికి కనీస సదుపాయాలు లేవని చెప్పారు. కూటమి ప్రభుత్వం స్పందించి గ్రామానికి వసతులు కల్పించడంతో పాటు లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు.

భారీగా ఎస్‌ఐల బదిలీ ·7లో



అనంతగిరి మీదుగా ఒనకఢిల్లీ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సు

అనంతగిరిలో స్నోయగం

అనంతగిరిలో మంగళవారం ఉదయం పొగమంచు అందాలను పర్యాటకులు ఆస్వాదించారు. దట్టమైన మంచు కమ్మేయడంతో పర్యాటకులు ఎంజాయ్ చేశారు. ఎదురుగా వచ్చే మనిషి కనిపించనంతగా పొగమంచు కనిపించకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. పది గంటల వరకు పొగమంచు అందాలు కనువిందుచేశాయి.
- అనంతగిరి



నిర్మాణంలో ఉన్న పాడేరు మెడికల్ కాలేజీ

పాడేరు మెడికల్ కాలేజీలో అడ్మిషన్లకు గ్రీన్ సిగ్నల్

... మెయిన్ ఎడిషన్ 3వ పేజీలో

విద్యా సమాఖ్య కేంద్రం మూత

30 మంది టీచర్లు వెనక్కి...

- రెండు రోజుల క్రితం ఆదేశాలు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో భీమిలి డైట్‌లో ఏర్పాటు
- సెంటర్ పనితీరుపై ఆది నుంచి విమర్శలు
- పట్టించుకోని గత పాలకులు
- ప్రభుత్వం మారడంతో మూసివేతకు నిర్ణయం
- త్వరలో మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు



భీమిలి డైట్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్ ఆఫీస్

విశాఖపట్నం/భీమిలి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భీమిలి డైట్ (డిస్ట్రిక్ట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్)లో రెండేళ్ల నుంచి నిర్వహిస్తున్న విద్యా సమాఖ్య కేంద్రాన్ని (కమాండ్ కంట్రోల్ సెంటర్) మూసివేయాల్సిందిగా పాఠశాల విద్యా శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. అక్కడ పనిచేస్తున్న 30 మంది టీచర్లను గతంలో పనిచేసిన పాఠశాలలకు పంపించేశారు. వైసీపీ ప్రభుత్వం 2022 నవంబరులో భీమిలిలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుచేసి, అందులో పనిచేసేందుకు పలు జిల్లాల నుంచి 30 మంది టీచర్లను డిప్యూటేషన్‌పై నియమించింది. వారు ఇక్కడ నుంచి రాష్ట్ర స్థాయిలో పాఠశాల విద్యా శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలు, పాఠశాలలను పర్యవేక్షించాలని సూచించింది. ఒక్కొక్కరికీ ఒక్కో జిల్లా అప్పగించింది. పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేసిన తరువాత అప్‌లోడ్ చేసే ఫొటోలు, మధ్యాహ్న భోజనం ఫొటోలు, టీచర్ల అటెండెన్స్ ఇతరత్రా కార్యక్రమాలు అమలు తీరును ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని ఆదేశించింది. అయితే కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో 30 మందికి సరిపడా పని లేకపోయినా ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న వ్యక్తుల ద్వారా పలువురు టీచర్లు డిప్యూటేషన్ వేయించుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పనిచేయాల్సిన ఉపాధ్యాయులు విశాఖలో ఉండాలన్న ఉద్దేశంతో ఈ సెంటర్‌లో పోస్టింగ్ తెచ్చుకున్నారు. అలాగే నగర శివారులోని ఒక పాఠశాలలో ఒక టీచరు ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నారు. గత ఏడాది బదిలీల్లో సదరు టీచరు ఏజెన్సీకి బదిలీ కావల్సి ఉంది. బదిలీ తప్పించుకునేందుకు డిప్యూటేషన్‌పై కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెళ్లారు. ఇక కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరుపై చాలాకాలంగా ఫిర్యాదులు వచ్చినా విద్యా శాఖ అధికారులు పట్టించుకోలేదని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తుండేవి. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గత పాలకులకు అస్మదీయులైన టీచర్లతో నిండిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను రెండు రోజుల క్రితం మూసివేశారు. అక్కడ పనిచేసే టీచర్లు సంబంధిత పాఠశాలల్లో చేరారని డీఈవో చంద్రకళ తెలిపారు. త్వరలో మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వం మాదిరిగా మినీ సెంటర్లలో టీచర్లను కాకుండా బోధనేతర సిబ్బందిని నియమించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

1967కి ముందు సాగులో ఉన్న ఆదివాసీలు

అటవీ హక్కు పత్రాలకు అర్హులు

డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్



గ్రామ సభలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్

చింతపల్లి, సెప్టెంబరు 3: అటవీ భూములకు హక్కు పత్రాలు పొందేందుకు 1967వ సంవత్సరానికి ముందు సాగు చేస్తున్న ఆదివాసీలు అర్హులని డీఎఫ్‌వో చిట్టపులి సూర్యనారాయణ పడాల్ అన్నారు. మంగళవారం హైకోర్టు ఆదేశాలతో చవటపాడు, పెండ్లిమామిడి గ్రామాల మధ్య తలెత్తిన అటవీ భూముల వివాదంపై తహసీల్దార్ రామకృష్ణ గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎఫ్‌వో మాట్లాడుతూ అటవీహక్కుల చట్టం 2005 ఆధారంగా సాగు హక్కు పత్రాలు మంజూరు చేసేందుకు 1967 ఫిబ్రవరికి ముందు అటవీ భూముల్లో సాగులోనున్న ఆదివాసీలు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సాగు హక్కు పత్రాలు జారీ చేసేందుకు ఎఫ్ఆర్‌సీ, ఎస్‌డీఎల్‌సీ, డీఎల్‌సీ స్థాయిలో విచారణ చేయాల్సి వుందన్నారు. ఈవిచారణలో 1967వ సంవత్సరానికి పూర్వం నుంచే అటవీ భూములు సాగులో ఉన్నట్టు నిర్ధారణ జరిగితే ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేస్తామన్నారు. పెండ్లిమామిడి గిరిజనులు సాగు హక్కు పత్రాలు మంజూరు చేయాలని హైకోర్టును అభ్యర్థించిన 110 హెక్టారుల భూమిని 2003లో చవటపాడు వీఎస్ఎస్‌కి కేటాయించామన్నారు. ఈ భూముల్లో వీఎస్ఎస్ సభులందరూ అటవీ శాఖ పర్యవేక్షణలో అటవీ ఫలసాయం పొందవచ్చునన్నారు. ఈ భూములపై రైతులకు వ్యక్తిగత సాగు హక్కు పత్రాలు జారీ చేసేందుకు అవకాశం లేదన్నారు. వీఎస్ఎస్ భూములను పెండ్లిమామిడి, చవటపాడు గ్రామాల గిరిజనులు అంగీకరిస్తే అటవీ శాఖ పర్యవేక్షణలో వారికి సాగు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ రెండు గ్రామాల గిరిజనులు 1967 ఫిబ్రవరికి ముందుగా సాగు చేస్తున్నట్టు లిఖిత పూర్వక ఆధారాలు వారం రోజుల్లో సమర్పించాలన్నారు. రైతులు ఆధారాలు రెవెన్యూ శాఖకు సమర్పిస్తే పట్టాల కోసం చేసుకున్న దరఖాస్తులు ఎందుకు తిరస్కరించబడ్డాయనే అంశంపై చర్చించి, ఎఫ్ఆర్‌సీ నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో చౌడుపల్లి సర్పంచ్ లలిత, ఫారెస్టు రేంజ్ అధికారి బి.అప్పారావు, డీఆర్‌వో వెంకటరాజు, గ్రామ పెద్దలు దేపూరి వెంగళయ్య, కరుణానిధి, వంతల సుబ్బారావు, సాగిన కృష్ణపడాల్, సాగిన చిరంజీవి, కిల్లో పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

క్రైం... crime news

గాయపడిన సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మృతి

మాకవరపాలెం, సెప్టెంబరు 3: ఇటీవల జరిగిన కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చీపురుపల్లి దుర్గనాయుడు మృతి చెందినట్టు ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు. మండలంలోని వెంకన్నపాలెం గ్రామానికి చెందిన దుర్గనాయుడు హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో పండగ సందర్భంగా స్వగ్రామానికి రెండు రోజుల క్రితం వచ్చారు. ఆదివారం నర్సీపట్నం నుంచి కారులో వెంకన్నపాలెం వెళుతుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అతడిని విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఈయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎలమంచిలి, సెప్టెంబరు 3: పట్టణంలోని తులసీనగర్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడని పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. తులసీనగర్‌కు చెందిన అలుగోలు రవిశంకర్(38) అప్పుల బాధతో సోమవారం ఇంట్లోనే పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతనిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. అతనికి తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నాని ఎస్ఐ తెలిపారు.

పెద్దేరులో వృద్ధుడి గల్లంతు

» మృతదేహం కోసం గాలింపు



వృద్ధుడి కోసం నదిలో గాలిస్తున్న ఈతగాళ్లు (ఇన్‌సెట్‌లో) గల్లంతైన నాగరాజు (ఫైల్)

చోడవరం, సెప్టెంబరు 3: మండలంలోని గౌరీపట్నం వద్ద పెద్దేరు నదిలో అకుల నాగరాజు (65) అనే వృద్ధుడు మంగళవారం మధ్యాహ్నం గల్లంతయ్యాడు. పొలాలకు వెళ్లేందుకు నదిలో దిగిన నాగరాజు ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయాడు. ఈ సమాచారం తెలియడంతో స్థానిక ఈతగాళ్లతోపాటు అగ్నిమాపక సిబ్బంది నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. నాగరాజుకు భార్య, కుమారుడు ఉన్నాడు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దేరు నదిలో ప్రవాహ ఉధృతి పెరిగింది. ఈ సమాచారం తెలియడంతో తహసీల్దార్ బి.తిరుమలబాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు మంగా జగన్నాథరావు, సర్పంచ్ కోన చంద్రరావు తదితరులు నది వద్ద ఉండి మృతదేహం కోసం గాలింపు చర్యలు పర్యవేక్షిస్తున్నారు.

25 కిలోల గంజాయి స్వాధీనం

» ఇద్దరి అరెస్టు



సీజ్ చేసిన గంజాయి, కారుతో పోలీస్ అధికారులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 3: విశాఖ ఏజెన్సీ నుంచి ఢిల్లీకి గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని సోమవారం రాత్రి అరెస్టు చేసి 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. నిందితులు గంజాయి రవాణాకు ఉపయోగించిన కారును, ఐదు సెల్‌ఫోన్లను, రూ. 250లు నగదును స్వాధీనం చేసుకున్నట్టు మంగళవారం తెలిపారు. సెంట్రల్ ఢిల్లీకి చెందిన మహ్మద్ ఫర్వేజ్ (19), ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అమేఠీకి చెందిన మహ్మద్ గుఫ్రాన్ (28)లు ఢిల్లీ నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ప్రాంతానికి వెళ్లి కారులో గంజాయితో వస్తుండగా పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణకు అందిన సమాచారం మేరకు తుమ్మపాల శివారు దాబా వద్ద సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో భాగంగా అనుమానం వచ్చిన కారును తనిఖీ చేయగా కారులో 25 కిలోల గంజాయి లభ్యమైందన్నారు. దీంతో ఇద్దరిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశామని సీఐ తెలిపారు. మంగళవారం నిందితులిద్దరిని కోర్టుకు హాజరుపరచిన అనంతరం రిమాండ్ తరలించామన్నారు.

భూవివాదంలో భార్యాభర్తలకు గాయాలు



గాయపడిన గొర్లె దేవుళ్లు, గొర్లె నారాయణమ్మ

కె.కోటపాడు, సెప్టెంబరు 3: భూవివాదంలో అన్న దమ్ములు కత్తులతో దాడి చేసుకోవడంతో భార్యా భర్తలకు గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఏ.కోడూరు ఎస్ఐ జె.రమేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కె.కోటపాడు రామయోగి అగ్రహారం గ్రామానికి చెందిన గొర్లె సన్యాసిరావు (అన్న), గొర్లె దేవుళ్లు (తమ్ముడు) మంగళవారం ఇంటి వద్ద భూవివాదంలో ఒకరినొకరు దూషించుకుంటూ కొట్లాటకు దిగారు. ఈ సందర్భంగా తమ్ముడు గొర్లె దేవుళ్లు, మరదలు నారాయణమ్మలపై అన్నయ్య సన్యాసినాయుడు కత్తితో దాడి చేశాడు. ఆ దాడిలో భార్యాభర్తలకు తలపై గాయాలయ్యాయి. వీరిద్దరిని కె.కోటపాడు 50 పడకల ఆసుపత్రికి తరలించగా.. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం గొర్లె దేవుళ్లకు మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించామని ఎస్ఐ జె.రమేష్ తెలిపారు. గొర్లె సన్యాసిరావును అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

» ఆనందపురం వద్ద ఢీకొన్న లారీలు

ఆనందపురం, సెప్టెంబరు 3: జాతీయ రహదారిపై విశాఖపట్నం జిల్లా ఆనందపురం వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ఇందుకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన కంటైనర్ లారీ డ్రైవర్ రాహుల్‌కుమార్ అలియాస్ భాస్కర్ (32) పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు నుంచి చేపల లోడుతో సోమవారం సాయంత్రం భువనేశ్వర్ బయలుదేరాడు. ఆనందపురం బ్రిడ్జిపైకి వచ్చేసరికి భాస్కర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కంటైనర్ లారీ అదుపుతప్పి డివైడర్ పైనుంచి అవతలి మార్గంలోకి వచ్చి...ఆ సమయంలో ఒడిశాలోని రాయగడ నుంచి అట్టల లోడుతో ఖమ్మం వెళుతున్న లారీని ఢీకొంది. ఈ క్రమంలో రెండు లారీలు బోల్తాపడ్డాయి. ప్రమాదంలో భాస్కర్‌తో పాటు అట్టల లోడు లారీ డ్రైవర్ రాయగడ జిల్లా జిమిడిపేటకు చెందిన వన్నల గౌరిశంకర్ (35) సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. చేపల లోడుతో వెళుతున్న లారీ క్లీనర్ ప్రదీప్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతిచెందాడు. ఆనందపురం ఎస్ఐ సంతోష్, ట్రాఫిక్ ఎస్ఐ పాపారావులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వన్నల గౌరీశంకర్‌కు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్టు తెలిసింది. భాస్కర్, ప్రధాన్‌ల కుటుంబ వివరాలు తెలియలేదు. కేసును సీఐ తిరుమలరావు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	91.00
లైవ్ ధర	111.00
విత్ స్కిన్	192.00
స్కిన్ లెస్	202.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

గణపయ్యకు తుది మెరుగులు

» చవితి వేడుకలు సమీపించిన నేపథ్యంలో కళాకారులు బిజీ
» గొర్లివానిపాలెం కేంద్రంగా వివిధ ఆకృతుల్లో ప్రతిమల తయారీ



విక్రయానికి సిద్ధం చేసిన వివిధ ఆకృతుల్లో గల వినాయక ప్రతిమలు



ప్రతిమలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు

పరవాడ, సెప్టెంబరు 3: చవితి వేడుకలు సమీపించిన నేపథ్యంలో వినాయక ప్రతిమల తయారీ దాదాపుగా చివరి దశకు చేరుకుంది. కళాకారులు తుది మెరుగులు దిద్దే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని గొర్లివానిపాలెంలో ఏటా భారీ సంఖ్యలో ప్రతిమలు తయారు చేస్తుంటారు. ఇందుకు కావాల్సిన ముడిసరకులు హైదరాబాద్, రాజమహేంద్రవరం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి తీసుకు వస్తారు. ఇప్పటికే పలు మండలాల్లో చవితి ఉత్సవాలు నిర్వహించేవారు ఆర్డర్లు ఇచ్చి ప్రతిమలను తయారు చేయించుకుంటున్నారు. స్థానికంగా తయారు చేసిన ప్రతిమలు ఈ మండలంతో పాటు పెదగంట్యాడ, గాజువాక, అగనంపూడి, కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్, అచ్యుతాపురం, ఎన్టీపీసీ, వాడచీపురుపల్లి, ఫార్మా సిటీ, తంతడి తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తుంటారు. వీటి ధరలు రూ. 1500లు నుంచి రూ. 18వేలు వరకు ఉన్నాయి. రెండు అడుగుల ఎత్తు నుంచి 12 అడుగుల ఎత్తు వరకు గల ప్రతిమలు ఇక్కడ రూపుదిద్దుకుంటున్నాయి. ఈ సందర్భంగా విగ్రహాల తయారీదారుడు ఆర్.సాయి 'ఆంధ్రజ్యోతి' మాట్లాడుతూ గత 25 ఏళ్లగా ప్రతిమలను తయారు చేస్తున్నట్టు చెప్పారు. చవితి వేడుకలకు రెండు నెలలు ముందు నుంచే పనులు చేపడుతున్నామన్నారు. సుమారు పది మంది కూలీలను పెట్టుకుని ప్రతిమలను తయారు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 50శాతం ప్రతిమలను ఉత్సవాల నిర్వాహకులు బుక్ చేసుకున్నట్టు వెల్లడించారు.

ఈ-క్రాప్ నమోదు 50 శాతం కాలేదు

» జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు
» గడువును పెంచాలని ప్రభుత్వాన్ని కోరతా..



ఈ-క్రాప్ నమోదుపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాధికారి మోహన్‌రావు

రావికమతం, సెప్టెంబరు 3: జిల్లాలో ఈ-క్రాప్ నమోదు 50 శాతం కూడా పూర్తి కాలేదని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. మంగళవారం ఈ-క్రాప్ నమోదు, ఈ-పంట నమోదులను గుడివాడ, రావికమతం, పి.పొన్నవోలు గ్రామాలలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో ఉద్యాన, వ్యవసాయ పంటలకు మూడు లక్షల ఎకరాలకు నెల 15వ తేదీలోగా ఈ-క్రాప్ నమోదు చేయాల్సి ఉందన్నారు. ఇంతవరకు జిల్లా వ్యాప్తంగా ఒక లక్షా 30 వేల ఎకరాలకు మాత్రమే ఈ-క్రాప్ చేశారన్నారు. ఇందుకు కారణం కొన్ని మండలాలలో వరి నాట్లు ఇంకా కొనసాగడంతోపాటు సిబ్బందికి ప్రతి నెలా పింఛన్లు పంపిణీ, ఇంటింట సర్వే ఇతర పనులు అప్పగించడమేనన్నారు. దీనివల్లే ఈ-క్రాప్ నమోదు చేయలేకపోయినట్టుగా గుర్తించామన్నారు. ఈ-క్రాప్ నమోదుకు ఈనెలాఖరు వరకూ పెంచాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. ఇంతవరకూ ఈ-క్రాప్ నమోదులో దేవరాపల్లి,నాతవరం, ఎస్.రాయవరం, చోడవరం మండలాలు ముందంజలో ఉండగా.. అచ్యుతాపురం, రోలుగుంట వెనుకబడి ఉన్నాయన్నారుత. రావికమతం మండలంలో 9,225 ఎకరాలకుగాను ఇంతవరకు 6,416.80 ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు జరిగిందన్నారు. ఇంతవరకు వరి పైరు చీడ పీడలు ఆశించలేదని, ప్రస్తుతం ఆశాజనకంగానే ఉందన్నారు. అనంతరం రావికమతం వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పనితీరులో అలసత్వం వహించే సిబ్బందిని ఏ మాత్రం ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో రూప, సిబ్బంది పాల్గొన్నారు.

శారదా నదిలో ఒకరి మృతదేహం లభ్యం

రాంబిల్లి, ఆగస్టు 3: మండలంలోని నారాయణపురం శారదా నదిలో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు రాంబిల్లి సీఐ నర్సింగరావు తెలిపారు. అతను ఎలమంచిలి మండలం కట్టుపాలెం గ్రామానికి చెందిన రవాడ అప్పారావు(61)గా గుర్తించినట్టు సీఐ చెప్పారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఈ నెల 1న సాయంత్రం అప్పారావు గ్రామాన్ని ఆనుకొని ఉన్న శారదా నది కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ జారిపడి మునిగిపోయాడు. అప్పారావు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఈ నెల 2న అతని కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరకలేదు. అయితే నారాయణపురం శారదా నదిలో అతని మృతదేహాన్ని మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పరిశీలించిన పోలీసులు అతని కుటుంబ సభ్యులకు వివరాలు అందజేశారు. వారు వచ్చిన తరువాత శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.

భారీగా ఎస్ఐల బదిలీ

పాడేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాడేరు పోలీస్ డివిజన్ పరిధిలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్‌జెట్టి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రం పాడేరు ఎస్ఐగా చోడవరం నుంచి ఎ.సూర్యనారాయణను నియమించారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కె.పాపినాయుడు	యలమంచిలి టౌన్	డుంబ్రిగుడ
కె.సంతోశ్‌కుమార్	డుంబ్రిగుడ	వీఆర్, విశాఖపట్నం
ఎస్.షణ్ముఖరావు	కురుపాం	జి.మాడుగుల
ఎ.శ్రీనివాసరావు	జి.మాడుగుల	వీఆర్, విశాఖపట్నం
ఎల్.సురేశ్	రోలుగుంట	ముంప(కొయ్యూరు)
జె.లోకేశ్‌కుమార్	ముంప(కొయ్యూరు)	వీఆర్, విశాఖపట్నం
ఎ.సూర్యనారాయణ	చోడవరం	పాడేరు
జి.తేజేశ్వరరావు	అనకాపలి రూరల్	ముంచంగిపుట్టు
కె.రవీంద్ర	ముంచంగిపుట్టు	సీలేరు(జీకేవీధి)
జె.రామకృష్ణ	సీలేరు (జీకేవీధి)	డీసీఆర్‌బీ పాడేరు
కె.రమణ	వీఆర్, అనకాపల్లి	పెదబయలు
పి.మనోజ్‌కుమార్	పెదబయలు	వీఆర్, విశాఖపట్నం
జి.వీరబాబు	జామి (విజయనగరం)	స్పెషల్ బ్రాంచ్, పాడేరు

సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి : డీపీవో



సంపద కేంద్రంలో వానపాములు వదులుతున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 3: మండలంలో గల అన్ని గ్రామ పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులను డీపీవో ఆర్.శిరీషారాణి ఆదేశించారు. మండలంలోని పీఎల్ పురం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె డీపీఆర్‌సీ కో-ఆర్డినేటర్ నాగలక్ష్మితో కలిసి మంగళవారం సందర్శించి వానపాములను వదిలారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వల్ల గ్రామాలు పరిశుభ్రంగా తయారవ్వడమే కాకుండా పంచాయతీలకు వర్మీ కంపోస్టు అమ్మకాల ద్వారా ఆదాయం లభిస్తుందన్నారు. సత్యవరం, నామవరం, పెద రాంభద్రపురం తదితర పంచాయతీలను సందర్శించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు వైవీ.సత్యనారాయణ, ఆచారి, శ్రీధర్, రామగోవిందు పాల్గొన్నారు.

మహా విలీనం?

» జీవీఎంసీలోకి భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలు
» మొత్తం 64 పంచాయతీలు...
» క్యాంపు కార్యాలయంలో నాయకులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమావేశం
» నగర పాలక సంస్థలో కలిస్తే శరవేగంగా అభివృద్ధి చెందుతాయని వెల్లడి
» పదేళ్ల వరకూ ఇంటి పన్నులు పెంచకుండా చూస్తానని హామీ
» నాయకుల అంగీకారం



ఆనందపురం మండల ప్రజాప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చర్చలు

భీమునిపట్నం, సెప్టెంబరు 3: మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ)లో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలోని 64 పంచాయతీల విలీనం ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. ఇదే విషయమై మంగళవారం బీచ్‌రోడ్డులో గల తన క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు మూడు మండలాల ముఖ్య నాయకులతో వేర్వేరుగా సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీలో విలీనం కావడం వల్ల గ్రామీణ ప్రాంతాలు త్వరితగతిన అభివృద్ధి చెందడానికి అవకాశాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంతాలన్నీ శరవేగంగా అభివృద్ధి సాధిస్తాయన్నారు. ఈ క్రమంలో పట్టణంలో గల మూడు ప్రధాన రహదారులను విస్తరిస్తామన్నారు. విలీనం తర్వాత ఈ ప్రాంత భూముల విలువ కూడా పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో పట్టణాలు, నగరాలకు ఆనుకుని ఉన్న గ్రామీణ ప్రాంతాలను ఆయా కార్పొరేషన్లలో విలీనం చేయాలన్నది తమ ప్రభుత్వ విధాన నిర్ణయమన్నారు. ఇది ఒక్క జీవీఎంసీకే పరిమితం కాదని అందరూ గుర్తించాలన్నారు. ఈ ప్రక్రియ సామరస్యంగా పూర్తికావాలన్నది తమ అభిమతమన్నారు. అందుకే స్థానిక నాయకుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత ప్రభుత్వం అధికారిక నిర్ణయం వెలువడుతుందని మునిసిపల్ మంత్రి పి.నారాయణ సూచించారన్నారు. కాగా జీవీఎంసీ విలీనమైతే ఇంటి పన్నులు పెరిగిపోతాయని, ఎన్ఆర్ఈజీఎస్ పథకం ఆగిపోతుందని, దానివల్ల ఉపాధి పనులు చేసుకుని బతుకుతున్న గ్రామీణ ప్రాంతాల వాసులు ఆర్థికంగా ఇబ్బందిపడతారని ఈ సందర్భంగా పలువురు ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలిసింది. అందుకు గంటా మాట్లాడుతూ విలీనమైన పదేళ్ల వరకూ ఇంటి పన్నులు పెరిగే అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటామని, ఉపాధి పథకంపై కూడా మాట్లాడతానని చెప్పినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో నాయకులంతా జీవీఎంసీలో విలీనానికి అంగీకారం తెలిపారు. ఆనందపురం మండలంలోని 26 పంచాయతీలు, పద్మనాభం మండలంలో 22, భీమిలి మండలంలో 16...మొత్తం 64 పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం. ఈ సమావేశంలో భీమిలి మండల టీడీపీ నాయకులు దంతులూరి అప్పల నరసింహరాజు, గాడు వెంకటప్పడు, యరబాల అనిల్‌ప్రసాద్, శరగడ అప్పారావు, అల్లు చిన్నయ్య, ఆనందపురం మండలానికి చెందిన నాయకులు గంగ్రెడ్డి స్వామినాయుడు, బీఆర్‌బీ నాయుడు, మహంతి శివాజీ, తాట్రాజు అప్పారావు, పద్మనాభం మండల నాయకులు కోరాడ రమణ, కశిరెడ్డి దామోదరరావు, కాళ్ల నగేష్‌కుమార్, దంతులూరి గోపీబాబు, రాచకొండ అప్పల నర్సింహమూర్తి, కురిమిన లీలావతి, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జనసేన నాయకులు శాకరి శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు కంటుభుక్త రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజు వేడుకలకు స్పీకర్ అయ్యన్న దూరం



నర్సీపట్నం, సెప్టెంబరు 3: తుఫాన్ కారణంగా రాష్ట్రం విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్న కారణంగా బుధవారం పుట్టిన రోజు వేడుకలకు దూరంగా ఉంటున్నట్టు స్పీకర్ అయ్యన్న పాత్రుడు మంగళవారం ట్విట్టర్ ద్వారా ప్రజలకు సందేశం పంపారు. సెప్టెంబరు 4న అయ్యన్నపాత్రుడు పుట్టిన రోజు వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకుంటారు. పదవిలో ఉన్నా.. లేకపోయినా..వేలాదిగా ఆయన ఇంటికి తరలి వచ్చి శుభాకాంక్షలు తెలియజేస్తారు. ఈ ఏడాది తుఫాన్ కారణంగా పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం లేదని స్పీకర్ పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, అభిమానులు ఎటువంటి వేడుకలు జరపవద్దని సూచించారు. ఆ మొత్తాన్ని వరద బాధితుల కోసం వ్యయం చేయాలని పిలుపునిచ్చారు.

ఫార్మసీ క్లస్టర్ హెడ్‌గా రాజేశ్



కె.రాజేశ్

కొత్తూరు, సెప్టెంబరు 3: ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల క్లస్టర్ హెడ్‌గా తనను ఎన్నుకున్నట్టు కె.రాజేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం బొబ్బిలి భాస్కరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహి స్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

మిస్టర్ టీన్ ఇండియా అవార్డు గ్రహీతకు ఘన స్వాగతం



శానాపతి ఆదిత్యనాయుడును అభినందిస్తున్న గ్రామస్థులు

ఎలమంచిలి, సెప్టెంబరు 3: మిస్టర్ టీన్ ఇండియా అవార్డును కైవసం చేసుకున్న ఏటికొప్పాక గ్రామానికి చెందిన శానాపతి ఆదిత్యనాయుడికి మంగళవారం గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదిత్యానాయుడు మాట్లాడుతూ గత నెల 31న ఢిల్లీలో మిస్ అండ్ మిస్టర్ టీన్ ఇండియా పోటీలు జరిగాయని, ఇందులో తాను టైటిల్ గెలుచుకున్నట్టు చెప్పారు. జడ్పీటీసీ శానాపతి సంధ్యారాముల కుమారుడు ఆదిత్యానాయుడు ఈ ఘనత సాధించడం పట్ల గ్రామానికి చెందిన అన్నం వెంకట్రావు, కరణం రవి, చిట్టినాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



కోటవురట్ల కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కోటవురట్ల, సెప్టెంబరు 3: విద్యార్థినులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ ప్రశాంతి సూచించారు. మంగళవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమె కోటవురట్ల కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు రక్త పరీక్షలు చేశారు. వసతి గృహంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పౌష్టిహాకారం తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమం డాక్టర్ సంతోశ్‌కుమార్, ఎంపీహెచ్‌వో గోవిందరావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ సరితాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మరికొన్ని రైళ్లు రద్దు

విశాఖపట్నం, సెప్టెంబరు 3: భారీ వర్షాలతో జత రేక్‌లు అందుబాటులో లేక 4న (బుధవారం) విశాఖ-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు కొన్ని రైళ్లను రద్దు చేశారు. 4న(బుధవారం) విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20708), విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833)), నాందేడు-విశాఖ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20812), పాండిచ్చేరి-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12868), సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్ ప్రెస్ (20707), సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20834) రద్దు చేశారు. కాగా, మూడు రోజులుగా రైళ్ల రద్దుతో ఒరిజినేటింగ్ స్టేషన్లలో జత రేక్‌లు నిలిచిపోవడంతో మంగళవారం (3న) విశాఖ-నాందేడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20811), నాందేడు-సంబల్‌పూర్ నాగావళి ఎక్స్‌ప్రెస్ (20810), చెన్నై సెంట్రల్-హౌరా మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12840), చెన్నై సెంట్రల్-విశాఖ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22870), హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ (12703), గుంటూరు-విశాఖ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22702), కడప/తిరుపతి-విశాఖ తిరుమల ఎక్స్‌ప్రెస్ (17487) రైళ్లను రద్దు చేయాల్సి వచ్చినట్టు ఆయన తెలిపారు.

ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు

» ఢిల్లీ నుంచి విశాఖ చేరిన తరువాత సమాచారం
» క్షుణ్ణంగా తనిఖీ చేసిన భద్రతా సిబ్బంది
» ప్రమాదం లేదని నిర్ధారణ

గోపాలపట్నం (విశాఖపట్నం), సెప్టెంబరు 3: ఢిల్లీ నుంచి విశాఖపట్నం వచ్చిన విమానానికి బాంబు బెదిరింపు కాల్ రావడంతో విమానాశ్రయంలో కలకలం రేగింది. విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...మంగళవారం సాయంత్రం 5.40 గంటలకు ఏఐ 471 (ఎయిర్ ఇండియా) విమానం ఢిల్లీ విమానాశ్రయం నుంచి విశాఖపట్నం బయలుదేరింది. విమానం బయలుదేరిన కొద్దిసేపటికే ఢిల్లీ విమానాశ్రయానికి ఓ ఆగంతకుడు ఫోన్ చేసి విమానంలో బాంబు ఉన్నట్టు చెప్పాడు. దీంతో అప్రమత్తమైన ఢిల్లీ విమానాశ్రయం అధికారులు విశాఖపట్నం విమానాశ్రయ అధికారులకు సమాచారం అందజేశారు. ఈ విమానం రాత్రి 8.05 గంటలకు విశాఖపట్నం చేరుకోగా... 8.19 గంటలకు ఢిల్లీ విమానాశ్రయ అధికారులు సమాచారం ఇచ్చారు. దీంతో విశాఖ విమానాశ్రయం అధికారులు భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రయాణికులను, లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం బయటకు పంపారు. ఆ తరువాత భద్రతా సిబ్బంది అధికారుల సూచనతో నిబంధనలను అనుసరించి విమానాన్ని తనిఖీ చేసి ఎటువంటి అపాయం లేదని నిర్ధారించుకున్న తరువాత తిరిగి ఢిల్లీ పంపించడానికి అనుమతించారు. ఈ క్రమంలో రాత్రి 8.55 గంటలకు విశాఖ నుంచి ఢిల్లీ బయలుదేరాల్సిన విమానం 11.45 గంటల వరకూ విశాఖ విమానాశ్రయంలో నిలిచిపోయింది. ఈ విమానం రాత్రి 12.30 గంటలకు బయలుదేరే అవకాశం ఉందని తెలిసింది. ఇదిలావుండగా బెదిరింపు కాల్‌పై ఢిల్లీ పోలీసులకు అక్కడి విమానాశ్రయ అధికారులు ఫిర్యాదు చేయడంతో ఆగంతకుడి గాలిస్తున్నట్టు తెలిసింది. కాగా ఇదే విమానంలో ఎంపీ పురందేశ్వరి ఢిల్లీ నుంచి విశాఖ చేరుకున్నారు.



యువతను ఉద్దేశించి మాట్లాడుతున్న నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్

జాబ్‌మేళాలో 52 మందికి ఉద్యోగాలు

►► జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రశాంత్‌కుమార్

అరకులోయ, సెప్టెంబరు 3: అరకులోయ ఆర్‌ఐటీఐలో మంగళవారం జరిగిన జాబ్‌మేళాలో 52 మందికి పలు కంపెనీల్లో ఉద్యోగాలు లభించినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఈ జాబ్‌మేళాను అరకులోయ సీఐ హిమగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంత దూరమైనా ఉద్యోగానికి వెళ్లి పనిచేయాలని సూచించారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఇటువంటి జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని భవిష్యత్‌కు బాట వేసుకోవాలన్నారు. ఈ జాబ్‌మేళాను రాష్ట్ర నైపున్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా, నిర్వహించినట్టు చెప్పారు. అలాగే జాబ్‌మేళాలో ఏడు కంపెనీల ప్రతినిధులు పాల్గొని అర్హతలున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఈ జాబ్‌మేళాలో ఏడు కంపెనీల ప్రజా ప్రతినిధులతో పాటు జిల్లా ఉపాధి కల్పనాధికారి సంగీత, సీడ్‌ఏపీ భారతీ, ఆర్‌ఐటీఐ వైస్‌ప్రిన్సిపాల్ బొంజుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరి విద్యార్థులకు ఇండస్ట్రియల్ టూర్



దొడ్డవరంలో ఇండస్ట్రియల్ టూర్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ

కొయ్యూరు, సెప్టెంబరు 3: ఇంజనీరింగ్, డిప్లొమో కోర్సులు చేసిన గిరిజన విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికలు వేసుకునేందుకు వీలుగా ఇండస్ట్రియల్ టూర్ నిర్వహిస్తున్నామని సీఐ వెంకటరమణ తెలిపారు. ఇంజనీరింగ్, ఐటీఐ, డిప్లొమోతో పాటు ఏదైనా డిగ్రీ చదివిన విద్యార్థులకు విశాఖపట్నంలోని పలు పరిశ్రమలు చూపించి, వారి చదువు ఏ ఉద్యోగాలు ఉంటాయో తెలుసుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ యాత్రకు వెళ్లాలనే ఆసక్తి ఉన్న వారు కొయ్యూరు, మంప స్టేషన్లను సంప్రదించాలని, లేదా 9440904241, 9440904217 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



కిలగాడలో నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 3: జాతీయ అంధత్వ నివారణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం కిలగాడలో డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేత్రదానం చేసేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని, నేత్రదానం చేయండి మరోసారి జీవించండి అంచూ గ్రామ నలుమూలలకు ర్యాలీగా వెళ్లి ప్రచారం చేపట్టారు. మరణించిన తర్వాత నేత్రదానం చేయడం వలన అందత్వంతో బాధపడుతున్న వారికి చూపు నిచ్చిన వారు అవుతారని, వయసుతో సంబధం లేకుండా ప్రతీ ఒక్కరూ మరణం అనంతరం నేత్రదానం చేయవచ్చునని వైద్యులు పేర్కొన్నారు. నేత్రదానంలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్తాలిమిక్ అసిస్టెంట్ కిశోర్‌కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, కిలగాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కించాయిపుట్టులో దోమల మందు పిచికారీ



ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 3: ఈ ఏడాది మలేరియా కేసులు నమోదు కావడంతో వైద్య, ఆరోగ్య శాఖ మలేరియా దోమల నివారణపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా మండల కేంద్రానికి సమీపంలో గల కించాయిపుట్టు పంచాయతీ కేంద్రంలో మంగళవారం దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో వర్షపు నీరు నిలిచి ఉండటంతో దోమలు ఉత్పత్తి ఎక్కువయే అవకాశం ఉందని, ప్రతీ ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా తదితర వ్యాధులు బారిన పడే అవకాశం ఉందన్నారు. వాటి బారిన పడకుండా తగి జాగ్రత్తలు పాటించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కిలగాడ వైద్యాధికారి రమేష్, వైద్య సిబ్బంది అశోక్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కూతురి కడసారి చూపు కోసం ప్రాణాలను తెగించిన తండ్రి



గెమ్మెల అర్జున్‌ను ఓనుగెడ్డ గెడ్డను దాటిస్తున్న గిరిజనులు

అనంతగిరి, సెప్టెంబరు 3: తన కూతురిని కడసారి చూసేందుకు ఓ తండ్రి ప్రాణాలను సైతం తెగించి ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను దాటి వెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లంగుపర్తి పంచాయతీ ఓనుకొండ గ్రామానికి చెందిన గెమ్మెల అర్జున్ కుమార్తె బొర్రా పంచాయతీ జీరుగెడ్డ గ్రామానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంది. సోమవారం ఆమె అనారోగ్యంతో మృత్యువాత పడింది. దీంతో కుమార్తెను కడసారి చూసేందుకు అర్జున్ ఓనుకొండ గ్రామ గిరిజనుల సాయంతో ఓనుకొండగెడ్డను దాటుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓనుకొండ గ్రామానికి వంతెన నిర్మాణం చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

ఆదివాసీలు పోషకాహారం తీసుకోవాలి

చింతపల్లి, సెప్టెంబరు 3: ఆదివాసీలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ఏసీడీపీవో రామలక్ష్మి సూచించారు. మండలంలోని సిరిపురం, కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆహారంలో పప్పుధాన్యాలు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సత్యవతి, ఉస్నీష బేగం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం

►► ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఎదుట కాంట్రాక్టు ఉద్యోగుల ఆందోళన



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్య ఉద్యోగులు

పాడేరు రూరల్, సెప్టెంబరు 3: సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధమని స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ మేరకు సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ఎల్.సుందరరావు, జల్లి రాజబాబు, అమర్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆస్పత్రి ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీలోగా పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు ఇచ్చి పది రోజులైనా బకాయిపడ్డ వేతనాల సమస్య పరిష్కారం చేయకపోవడం అన్యాయమని వాపోయారు. ఆరు నెలలుగా బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలని అధికారులకు వినతులు అందించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. గత నెల 24వ తేదీన వైద్య ఆరోగ్య శాఖాధికారుల సమావేశంలో వేతనాలను ఈ నెల మొదటి వారంలో చెల్లిస్తామన్న అధికారులు ఇంతవరకు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. వేతనాలు లేకపోవడంతో ఉద్యోగులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకుండా లేకుంటే ఈ నెల 7వ తేదీ నుంచి ఆస్పత్రిలోని అన్ని విభాల ఉద్యోగులతో కలిసి సమ్మె చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఉద్యోగుల యూనియన్ నాయకులు అనంత్, ఎలీషా, సరోజని, అన్నపూర్ణ, స్వామి, రాంబాబు, భవాని, రాజు, చంటి, శ్రీను, సూరిబాబు పాల్గొన్నారు.

హెచ్‌ఎం నిర్లక్ష్యంతోనే విద్యార్థినుల అస్వస్థత

►► ఎమ్మెల్యే మత్స్యలింగం, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, జడ్పీ చైరపర్సన్ సుభద్ర

డుంబ్రిగుడ, సెప్టెంబరు 3: ఆశ్రమ పాఠశాలలో బాధ్యతాయుతమైన పోస్టులో ఉన్న హెచ్‌ఎం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని జాముగుడ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను మంగళవారం సందర్శించారు. అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందాక కొలుకున్న విద్యార్థినులను పరామర్శించారు. అలాగే భోజన మెనూను పరిశీలించి రుచి చూశారు. నిత్యావసర సరుకులు, కూరగాయల గదిని పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. రోజువారి మెనూను పరిశీలించే బాధ్యత విద్యార్థి లీడర్లు చూసుకోవాలన్నారు. తప్పు చేసిన యాజమాన్యానికి వత్తాసు పలకకుండా, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. పిల్లలపై దృష్టిసారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జడ్పీ నిధులతో భోజనశాల ఏర్పాటు అయ్యేలా చూస్తామని జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర అన్నారు. నాణ్యమైన ఆహరంతోనే శారీరక ఎదుగుదలతో పాటు ఆరోగ్యవంతులుగా ఉండడానికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చూడాలని కోరారు. మరోమారు పాఠశాలకు వచ్చి పరిశీలిస్తామని, తీరు మారకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

9న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

చింతపల్లి, సెప్టెంబరు 3: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకుల పోస్టుల భర్తీకి ఈ నెల 9న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ కళాశాలలో ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్ అతిథి అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు మాస్టర్ ఆఫ్ ఎకనామిక్స్ మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్‌లో 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. పీహెచ్‌డీ, యూజీసీ, నెట్, ఏపీసెట్ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హతలు, డెమో క్లాస్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువపత్రాలకు ఆ రోజు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆమె సూచించారు.

వర్షాలకు రెండు గేదెలు మృత్యువాత



లోతుగెడ్డలో మృతి చెందిన సూడు గెదెను పరిశీలిస్తున్న పశు వైద్యాధికారి ధమయంతి

చింతపల్లి, సెప్టెంబరు 3: మండలంలో అధిక వర్షాల వల్ల రెండు గేదెలు మృతి చెందాయి. బాధితుల కథనం ప్రకారం మండల కేంద్రం మైలుకాలివీధికి చెందిన శెట్టి ఈశ్వరరావుకు చెందిన పాడి గేదె మంగళవారం డిగ్రీ కళాశాల దిగువన చెట్ల కొమ్మలు విరిగి పడడంతో మృతి చెందింది. అలాగే లోతుగెడ్డ గ్రామ పంచాయతీకి చెందిన చింతర్ల సునీల్‌కి చెందిన సూడుతోనున్న జాతి గేదె పొలాల గట్ల మధ్యలో పడిపోయి మృతి చెందింది. పశువులను నష్టపోయిన రైతులు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. మృత్యువాత పడిన పశువులను పశు వైద్యాధికారి ధమయంతి పరిశీలించారు.

బీఎల్‌వోలు ఇంటింట సర్వే చేయాలి

చింతపల్లి, సెప్టెంబరు 3: పక్కా ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేపట్టాలని తహసీల్దార్ టి.రామకృష్ణ ఆదేశించారు. మంగళవారం బీఎల్‌వోలతో ఓటరు సర్వేపై తహసీల్దార్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ బీఎల్‌వో తమ పరిధిలోని గృహాలను సందర్శించి ఓటర్ల జాబితాను పరిశీలించాలన్నారు. అలాగే ఓటర్ల తాజా సమాచారం సేకరించాలని సూచించారు. మృతులు, వలస వెళ్లిపోయిన ఓటర్ల వివరాలు తీసుకోవాలన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

డుంబ్రిగుడ, సెపెంబరు 3: మండలంలోని గుంటసీమ, తూటంగి, కుజభంగి, బూసిపుట్టు వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని టీడీపీ అరకు పార్లమెంట్ టీఎస్‌టీయూసి ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి కోరారు. ఈ మేరకు పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, మాజీ మంత్రి శావణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గుంటసీమ, బూసిపుట్టుకు బస్సు సౌకర్యం కల్పించలేదన్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి గిరిజనులు ప్రమాదాలకు గురవుతున్నారని వినతి పత్రంలో ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన శ్రావణ్‌కుమార్, సమస్యను ప్రభుత్వం, ఆర్టీసీ ఉన్నతాధికారులతో దృష్టికటి తీసకు వెళ్లి బస్సు సౌకర్యం ఏర్పాటు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గిరిజన విద్యార్థినికి అభినందనలు



అనంతగిరి, సెప్టెంబరు 3: గిరిజన విద్యార్థి ఉత్తమ ఫలితాలతో అందరి ఆదరభిమానులను చూరగొంటున్నది. మండల కేంద్రంలోని బొడ్డచెట్టు కాలనీకి చెందిన బోయిన శ్రీవల్లి ఇటీవలే వెలువడిన నీట్ ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించడంతో ఆమెను స్థానిక నాయకులు అభినందించారు. 638 మార్కులతో మొదటి కౌన్సెలింగ్‌లోనే హైదరాబాద్‌లోని ఎయిమ్స్ కళాశాలలోని ఎంబీబీఎస్ సీటు సాధించడంతో తల్లిదండ్రులు భీమన్న, సుమిత్రతో పాటు కుటుంబ సభ్యులను జడ్పీటీసీ సభ్యుడు గంగరాజుతో పాటు స్థానిక నాయకులు, గ్రామస్థులు అభినందించారు. గిరిజన ప్రాంతానికి శ్రీవల్లి మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.



పాడేరు: మినుములూరు పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

కదంతొక్కిన ఆశా కార్యకర్తలు

►► సమస్యలపై పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల ఎదుట నిరసన కార్యక్రమాలు

పాడేరు రూరల్/చింతపల్లి/అరకులోయ/గూడెంకొత్తవీధి/సీలేరు, సెప్టెంబరు 3: మన్యంలోని పలు మండలాల్లో ఆశా కార్యకర్తలు కదంతొక్కారు. పాడేరు, చింతపల్లి, అరకులోయ, గూడెంకొత్తవీధి, సీలేరు తదితర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని గొంతెత్తారు. గిరిజన ప్రాంత ప్రజల ఆరోగ్య రక్షణకు అహర్నిషలు కృషి చేస్తున్న తమకు వేతనాలు పెంచాలని నినదించారు. పాడేరులో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, సీహెచ్‌డబ్ల్యూలను ఆశాలుగా గుర్తించాలని డిమాడ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారికి అందించారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు దాసమ్మ, పార్వతమ్మ, మోదకొండమ్మ, కొండమ్మ పాల్గొన్నారు. చింతపల్లిలో సీఐటీయూ జిల్లా నాయకుడు పాంగి ధనుంజయ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఆశ కార్యకర్తలు సమస్యలపై 66 రోజుల పాటు దీక్షలు చేపట్టడం జరిగిందన్నారు. దీంతో ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఒప్పంద జీవోను జారీ చేసిందన్నారు. ఈ జీవో తక్షణమే అమలు చేయాలన్నారు. సంఘం నాయకులు వరకోటి లక్ష్మి, భానుమతి, చెల్లయమ్మ, బాలమ్మ, దేశగిరి సుభద్ర, హైమవతి పాల్గొన్నారు. అరకులో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పనిభారంతో ఇబ్బందిపడుతున్న ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూనియన్ నాయకులు రాధిక, నాగలక్ష్మి, జన్ని కాసులమ్మ, వసంత పాల్గొన్నారు. గూడెంకొత్తవీధి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఒప్పందాల జీవోను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చి ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలన్నారు. సంఘం నాయకులు రమాదేవి, అరుణ జ్యోతి, ప్రభ, గంగాభవాని పాల్గొన్నారు. సీలేరులో సీఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు టి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వైద్య శాఖలో ఆశా వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాడ్ చేశారు.



చింతపల్లి: లంబసింగి వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు



అరకులోయ: మాడగడ పీహెచ్‌సీ ఎదుట సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

విద్యార్థులకు పోషకాహారం పెట్టండి

... 5వ పేజీ తరువాయి

సూక్ష్మ పోషకాలు, ప్రొటీన్లు సక్రమంగా అందేలా ఆహర పదార్థాలుండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 90 శాతం మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారని, వారికి నాణ్యమైన పోషకాహారంతో కూడిన భోజనాన్ని అందించాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ అన్నారు. అందుకు అనుగుణంగా వారంలో ఆరు రోజులకు భోజన మెనూ చార్టును సిద్ధం చేయాలని సూచించారు. వారంలో మూడు రోజులు చిక్కీలు, మరో మూడు రోజులు రాగి జావ విద్యార్థులకు అందించాలన్నారు. ఈ వర్క్‌షాప్‌లో రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ వర్చువల్‌గా పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఏరియా ఆస్పత్రిలో తొమ్మిది మంది విద్యార్థినుల డిశ్చార్జి

అరకులోయ, సెప్టెంబరు 3: అరకులోయ ఏరియా ఆస్పత్రి నుంచి తొమ్మిది మంది విద్యార్థినులు డిశ్చార్జి అయ్యారు. జామిగుడ వసతి గృహానికి చెందిన విద్యార్థినులు కలుషిత ఆహారం తిని 75 మంది అస్వస్థతకు గురి కావడంతో ఏరియా ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. వీరిలో మంగళవారం తొమ్మిది మందిని డిశ్చార్జి చేసినట్టు అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.రాము తెలిపారు. 24 మంది వార్డులో ఉండగా, తొమ్మిది మందిని వసతి గృహానికి పంపామని చెప్పారు.

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

చింతపల్లి, సెప్టెంబరు 3: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. మంగళవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని ప్రకటించారు. రంపచోడవరం, చింతపల్లి, పాడేరు, అరకువేలి డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా ఏడు మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 12 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదవుతుందన్నారు. వర్షాలు తగ్గిన తరువాత పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

బందవీధి బాలికల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

పాడేరు రూరల్, సెప్టెంబరు 3: జి.మాడుగుల మండలం బందవీధి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఆహారంలో నాణ్యత లేకపోవడంతో వసతిగృహ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఏటీడబ్ల్యూవో, టీడబ్ల్యూ డీడీ పర్యవేక్షణ లోపం కారణంగానే ఆశ్రమాల్లో విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయంపై కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టిసారించాలని, బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ మాజీ సభ్యురాలు లిల్లీ పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 3: గిరి రైతులు చిన్నపాటి మెలకువలు పాటిస్తూ వ్యవసాయ సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి (ఏవో) ఎం.శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ ముంజాపుట్టు గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. గోమూత్రం, పేడ, వేప ఆకులతో నీమాస్త్రం తయారీపై తెలియజేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వ్యవసాయ సాగు సమయంలో పురుగుల మందుల వాడకం వల్ల నష్టం కలిగే ప్రమాదం ఉందని, ప్రకృతి ఎరువులు వాడితే మంచి దిగుబడి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల కోఆర్డినేటర్ కె.ఆనంద్, వీహెచ్‌ఏ మోహన్, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిన్నారులకు పాల డబ్బాల వితరణ

డుంబ్రిగుడ, సెప్టెంబరు 3: మండలంలోని కంద్రుం పంచాయతీ గొందిగుడ గ్రామానికి చెందిన చిన్నారులకు గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర, యూనిటీ ఫర్ చారిటీ ట్రస్టు ప్రతినిధి నీలిజో స్పిన్ పాల డబ్బాలను వితరణ చేశారు. గ్రామానికి వంతల సౌయిత ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చి అనారోగ్యంతో మృతి చెందింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్న బాధిత కుటుంబానికి ప్రతి నెలా పాల డబ్బాలను పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధి తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనాయణ, నాయకులు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

పెదబయలు, సెప్టెంబరు 3: సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని రూడకోట వైద్యాధికారి పి.సత్యరావు తెలిపారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తల నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. తాగునీటి కాలుష్యం మూలంగా అతిసార, విష జ్వరాలు ప్రబలుతున్నాయని చెప్పారు. పక్కా రోడ్డు లేని గ్రామాల్లో గర్భిణులు ప్రసవానికి రెండు వారాలు ముందుగానే ఆస్పత్రికి తీసుకువచ్చే బాధ్యత ఆశ కార్యకర్త తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో బింగురాజు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 3: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని సీడీపీవో లక్ష్మీదేవి సూచించారు. మండలంలోని గూడెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునన్నారు. ప్రతి గర్భిణీ, బాలింత, చిన్నారులు సమతుల ఆహారం తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వినయ్, సూపర్‌వైజర్ కృష్ణకుమారి, వైద్య సిబ్బంది వలసమ్మ, మోహిని తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలకు రాజ్‌మా విత్తనాలు



ఆర్‌ఎస్‌కేలో విత్తనాల బస్తాలు

చింతపల్లి, సెప్టెంబరు 3: మండలంలో రైతు సేవా కేంద్రాలకు రాజ్‌మా విత్తనాలను ఏపీ సీడ్స్ అధికారులు పంపారని వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఈ విత్తనాలు వచ్చాయన్నారు. వారం రోజుల క్రితం ఏపీ సీడ్స్ అధికారులు పంపించిన రాజ్‌మా విత్తనాలు నాణ్యతలేదని గుర్తించి తిరిగి పంపించేశామన్నారు. ఈ మేరకు మరో విడత నాణ్యమైన విత్తనాలు పంపించడం జరిగిందన్నారు. మండలానికి వ్యవసాయ శాఖ 610క్వింటాళ్లు కేటాయించగా, ఇప్పటి వరకు 580 క్వింటాళ్లు వచ్చాయన్నారు. మరో రెండు కేంద్రాకులు విత్తనాలు రావాల్సి వుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకుడు చైతు పాల్గొన్నారు.